# 4

## పరువూ, ప్రతిష్ఠా

టౌవున్ హాలులో పశుపతి గంభీరోపన్యాసం వినడానికి వెళ్ళిన యువకులలో నారాయణ రావు ఒకడు. నారాయణరావు అంటే, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పురుషోత్తం తమ్ముడు.

పశుపతి ఆనాడు వ్యభిచార నిర్మూలనంమీద ఉపన్యసించాడు. “అవివాహితుడైన ప్రతి యువకుడూ ఓ కళావతిని వివాహమాడి, ఇంక వ్యభిచారగృహాలంటూ లేకుండా చెయ్యాలి.” అన్నాడు.

ఉపన్యాసానంతరం నారాయణరావు పశుపతిని కలుసుకొని, “మీ ఉపన్యాసం నన్ను ముగ్ధుణ్ణిగా చేసిందండీ... నేను తమరు చెప్పినట్లు ఓ కళావతిని పెళ్ళి చేసుకోవడమే

కాకుండా తమతోపాటు ప్రచారానికి పూనుకుంటాను,'' అన్నాడు.

పశుపతి అతన్ని మెచ్చుకొని, ''నేను మెరక వీధి పద మూడో నెంబరు ఇంట్లో ఉన్నాను. పెళ్ళిచేసుకోడానికి ఇష్ట పడ్డ భోగంపిల్లల ఫోటోలు కొన్ని నావద్ద ఉన్నాయి. నీకు నచ్చినదాన్ని ఎన్నుకోవచ్చు,'' అన్నాడు.

''నేను ఇప్పుడు ఎన్నుకోనక్కరలేదండీ. ఓ అమ్మా యిని నేను ఇదివరకే ప్రేమించాను. ఆమె చాలా అందమైనది. అంతే కాదు, సుగుణాలన్నీ ఆమెలో మూర్తీభవించాయి.''

''ఎవరబ్బా ఆ సుగుణాల సుందరి?''

''పెళ్ళి అయ్యేదాకా గోప్యంగా ఉంచాలని నేను ఇంకా ఎవరితోనూ చెప్పలేదు. మీతో చెప్పవచ్చు గనుక చెపుతున్నాను. ఆ అమ్మాయి పేరు నిర్మల—''

పశుపతి ఆ పేరు విని నిర్ఘాంతపోయి, ''ఎవరన్నావ్? నిర్మలా? కల్యాణి కూతురు—'' అన్నాడు.

''ఔనండీ. ఏం?''

పశుపతి తమాయించుకొని, ''అబ్బే, ఏం లేదు... నేను ఓ పొరబాటు చేశాననిపిస్తోంది. ఈ భోగంపిల్లలను ఎవరో పెళ్ళి చేసుకోవలసిందే కాని, నీలాంటి పరువూ ప్రతిష్ఠా కల కులీనుల కుర్రవాళ్ళు ఆ పనికి పూని, కులభ్రష్టులై పోకూడదు. ఆ కులంవాళ్ళే వాళ్ళను పెళ్ళి ఆడడం మంచిది. ముందు ముందు ఉపన్యాసాలలో ఈ విషయం చర్చిస్తాలే... నువ్వు పురుషోత్తంగారి తమ్ముణ్నని కదూ చెప్పావు? గొప్ప

ఇంటి బిడ్డవు చూడూ, మీ పరువూ, ప్రతిష్ఠా ఆలోచించుకోవాలి! చెపుతాగా! మళ్ళీ కలుసుకుందాం లే!'' అని నిష్క్రమించాడు.

## 2

దరిమిలాన నారాయణరావు నిర్మలవద్దకు వెళ్ళినప్పుడు ఆమె కంట తడి పెట్టి, ''ఇంక ఈ ఇంట్లో ఒక్క నిమిషం కూడా నిలవడానికి వీల్లేదనిపిస్తోంది. నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకొని సంసారిని కావడం మా అమ్మకు ఇష్టం లేదు. ఆ ఛండాలుడు వచ్చినప్పట్నుంచీ ఈ గొడవ మరీ ఎక్కువై పోయింది,'' అంది.

''ఏ ఛండాలుడు?''

''ఎవడో డబ్బున్నవాడు. ఉన్నా లేకపోయినా ఉన్నట్టే కనబడేవాడు!''

''ఎవడు వాడు?''

''ఎవడైతేనేం, ఓ పశువు! వాడి కబుర్లూ, వేలి ఉంగరాలూ చూసి ముసిలిది మురిసిపోయింది. 'ఆయన కుబేరుడే!' అని వర్ణిస్తోంది.''

''ఆ 'కుబేరు' డెవరో చెప్పావు కాదు.''

''చెప్పానుగా 'పశు'వని! పేరుకు తగ్గవాడే. 'పశుప'తిట!''

నారాయణరావు నిర్ఘాంతపోయాడు. ''పశుపతా? నిన్న టవున్‌హాల్లో సంఘసంస్కారంమీద లెక్చరిచ్చిన పశుపతేనా?''

"మధ్య పాపిడి క్రాపిం గుంటుంది. సిల్కు లాల్చీలు వేస్తాడు..."

"వాడే అయితే!"

"నాలుగు వేళ్ళకీ ఉంగరా లున్నాయా?"

"ఉన్నట్లే జ్ఞాపకం...ఆరి రాస్కెల్! గోముఖ వ్యాఘ్ర మన్న మాట! వట్టి శ్రీరంగనీతు లేనా అయితే? ఎందుకో ఈ నటన?"

"ఎందుకా? 'సంస్కార్ల' మన్న పేరుతో మిట్ట మధ్యాహ్నమప్పుడు కూడా ఈ కొంపలమ్మట తమ పరువు ప్రతిష్ఠలకు భంగం లేకుండా తిరగవచ్చని," అన్నది నిర్మల.

"వాడి మాటలకు మోసపోయి మన పెళ్లిమాట చెప్పాను. 'నిర్మల' అనే సరికి నిర్ఘాంతపోయాడు: స్కౌండ్రల్ .. అంతవరకూ 'భోగంపిల్లల్ని పెళ్ళి చేసుకోండి,' అన్నవాడల్లా ప్లేటు ఫిరాయించేసి, 'నువ్వు బ్రాహ్మణ కుర్రాడివి! భ్రష్టుడవై పోకూడ'దంటూ ప్రారంభించాడు. ఇదా కథా! ఈ మాటు కనపడనియ్, మొహం మీద ఉమ్మేసి అడుగుతా!"

నిర్మల హడలిపోతూ, "వద్దు. వాడి మొహమే చూడ వద్దు. దుష్టులకు దూరంగా ఉండడం మంచిది" అంది.

"ఆ మాట చేతకాని దద్దమ్మలకు చెప్పు–నాకాదు! ఇలాంటి పశుపతులను పది మందిని బొత్తి పెట్టి అప్పడాలను విరిచినట్లు విరవగలను తెలుసా?"

"తెలుసు. అందుకే నాకు భయం," అన్నది నిర్మల.

# 3

"లక్ష్మీ, ఇప్పుడు మనింటికొచ్చి వెళ్లినాయన ఎవరో తెలుసా? 'పశుపతిగా'రని ఒక గొప్ప సంఘసంస్కర్త. ఆయనమీాటింగులకు నేను వెళ్ళలేదు కాని, ఆయనకీర్తి విన్నాను." అన్నాడు పురుషోత్తం.

"ఏదైనా చందా కోసం వచ్చారా ఆయన?" అని అడిగింది మాలక్ష్మమ్మ.

"చందాకోసం కాదు; మన పరువూ, ప్రతిష్ఠా కాపాడడం కోసం దేవుడిలా వచ్చాడు—"

అదేసమయానికి గుమ్మం ఎక్కుతూన్న నారాయణ రావు ఆయనకంట బడ్డాడు. ఆయన కోపంతో "ఒరేయ్, ఇలా రా!" అన్నాడు.

"ఎందుకన్నయ్యా?"

"అన్నయ్య!—ఇంక నన్ను నువ్విలా పిలవడానికి వీల్లేదు! నా తమ్ముణ్నని చెప్పుకునే అర్హత పోయింది నీకు!"

"ఏం వదినా, ఈ వేళ అన్నయ్య ఇంత కోపంగాఉన్నాడు?"

కోపకారణం తెలియదు కనుక ఆమె మాట్లాడలేక పోయింది. పురుషోత్తం, "ఏదో మొదట అల్లరి చిల్లరగా తిరిగినా తర్వాత వాడే చక్కబడతాడనుకుంటే నాకు బాగా చేస్తున్నావు శాస్తి! ఆ 'నిర్మల' అన్న పిల్లను పెళ్లి చేసుకుంటా నంటున్నావటగా? నాకు తెలియదనుకుంటున్నావా? ఆ పశుపతిగారంతా చెప్పి వెళ్ళారు!" అన్నాడు.

నారాయణరావు ఉగ్రుడై, "ఎవడూ? ఆ రాస్కెల్. ఇక్కడికికూడా వచ్చాడన్న మాట?" అన్నాడు.

"ఎందు కలా పళ్లు కొరుకుతావ్? ఒహాళ్ళు చెప్పక పోతే మాత్రం దాగుతుందా?"

"దాపరిక మేముందిందులో? నేనే చెబుతున్నాగా?"

పురుషోత్తం నిర్ఘాంతపోయాడు. "చూశావుటే. బిడియం విడిచి ఎలా అంటున్నాడోను! ఏదో ఘనకార్యానికి మల్లే నాతో చెప్పి మరీ చేసుకుంటాట్ట దాన్ని! దీనితో నా పరువు—"

"నిర్మలను నేను పెళ్లిచేసుకోడంవల్ల ఇప్పుడు కొత్తగా పరువేమీ పోదు. మంగళసూత్రం కట్టకపోయినా ఆమె ఏ నాడో నాకు భార్య అయిందని తెలుసు."

"ఆ కులటను నీ 'భార్య' అని చెప్పుకోవడం పరువు తక్కువ కాదన్న మాట!"

"'ఉంపుడుకత్తె' అని చెప్పడంకన్నా 'భార్య'ను చేసుకోడం న్యాయం కాదా, అన్నయ్యా?"

"ఓహో! తెలివి ఎలా పరిణమించిం దాఖరికి? 'వినాశ కాలే విపరీతబుద్ధిః'...పో. నాశనమైపో! ఇంక నా గుమ్మం తొక్కకు! నీ పాడు మొహం కనపరచకు!"

నారాయణరావు నెమ్మదిగా "అలాగే, అన్నయ్యా... వదినా, సెలవు!" అని, గుమ్మంవైపు తిరిగాడు.

మాలక్ష్మమ్మ అడ్డువెళ్ళి, "వెళ్ళిపోకోయ్. రా... భోజనం చేద్దువుగాని," అన్నది.

పురుషోత్తంకు కోపం శమించలేదు. "ఈ కులభ్రష్టుడికా నా ఇంట భోజనం?" అన్నాడు పళ్లు పటపటలాడిస్తూ.

నారాయణరావు రోషంతో గుమ్మం దిగి వెళ్ళిపోయాడు. "పిలవండీ పాపం!"అన్నది దీనంగా మాలక్ష్మమ్మ.

"పోనియ్ భ్రష్టుణ్ని!" అని ఊరుకున్నాడు పురుషోత్తం.

# 4

"చూడు, నిర్మలా! 'అవశ్యం పితురాచారం' అని ఊరికే చెప్పారా పెద్దలు? దీని అర్థం, 'అందరూ తమ కులాచారాన్ని అనుసరించాలి' అని. అది అలా ఉంచు. ఊరికే 'పెళ్ళి, పెళ్ళి' అని ఉబలాట పడిపోతున్నావు కాని, పెళ్ళి చేసుకు బావుకునేదేముంది గనుక? పెళ్ళి చేసుకున్న వాళ్లు ఎలాంటి దాస్యాన్ని అనుభవిస్తున్నారో చూస్తున్నాంగా?" అన్నాడు పశుపతి.

అంతా విని నిర్మల, "పశుపతిగారూ, మిమ్మల్ని చూస్తే నాకు అసహ్యం వేస్తోంది!" అంది తగ్గు స్థాయిలో.

"ఆఁ! ఏమన్నావ్?"

"జాలి కూడా వేస్తోంది; ఏమంటే మా వారొచ్చే వేళ అయింది. ఇక్కడ మీరు ఆయనకంట పడ్డారా, మీ ప్రాణాలు నిలబడవ్! త్వరగా అవతలకు పొండి!"

పశుపతి ఆగ్రహంతో, "ఏమిటీ, నారాయణరావును చూసేనా నేను భయపడవలసింది? ఈ పశుపతి కున్న బలం

నీకు తెలీదన్న మాట! నేను 'ఊఁ' అన్నానంటే నా మను షులు నారాయణరావును నిమిషంలో ఖూనీ చేసి చక్కా వస్తారు తెలుసా?...'మా వారు' అనా అన్నావ్? తాళి కట్టించుకున్న పతివ్రతలాగే మాట్లాడుతున్నావే!...చూడు, నిర్మలా! వృథాగా పాడై పోకు! నారాయణరావుకు వాళ్ళ అన్నగారు ఇంక ఒక్క పైస కూడా దక్కనివ్వరు తెలుసా? నేనన్నావ్-నీకు ఏం కావలిస్తే అదిస్తాను! ఈ ఉంగరాలు చూడూ, అన్నీ అసలైన అమూల్య రత్నాలు! ఇది వజ్రం, ఇది పుష్యరాగం, ఇది గోమేధికం!...ఏమిటనుకున్నావో, ఒక్కొక్కటి బోలెడేసి ఖరీదు. ఇవేనా? లక్షలు కురిపిస్తాను... ఆశపడి వచ్చానా? హతాశుణ్ణి చేసి పంపెయ్యకు...ఆ! ఆగు. ఎక్కడికి పోతున్నావ్?..."

నిర్మల బాణంలా ఎదుటి గదిలోకి వెళ్ళి, తలుపులు భళ్ళుమని వేసి, బిడాయించుకుంది.

ముసలిది, "ఈ రాత్రి కింక లాభం లేదు. అల్లుడు గారూ!" అంది పశుపతిదగ్గరికి వస్తూ.

రాత్రి పదకొండు దాటింది. హోరుమని వర్షం కురిసి వెలిసింది. కప్పలూ, కీచురాళ్లూ అరుస్తోంటే, పశుపతి ఆ ఇల్లు వదలి, వీధి దాటి మైదానాన్ని ప్రవేశించాడు.

"పశుపతిమహాశయా, ఆగండి!"

పశుపతి ఉలిక్కిపడి, వెనక్కి తిరిగి, దూరాన వస్తోన్న వ్యక్తితో, "ఎవరది?" అన్నాడు.

"తాము కొన్ని నిమిషాల క్రితం ఖూనీ చేయిస్తానని సెలవిచ్చారే—ఆ నారాయణరావును!"

పశుపతి భయంతో పరుగెత్తబోయాడు. నారాయణ రావు వెంటాడి పట్టుకుని ఆపి—"ఇంత క్రితం నువ్వు నిర్మలతో ఆడిన పోకిరిమాటలన్నీ వాళ్ళ మేడమీద పొంచి ఉన్న నా చెవిని పడ్డాయి. ఆడవాళ్ళ ముందు రభస ఎందుకని ఈ మైదానంవరకూ నిన్ను వెన్నంటి వచ్చాను. ఆవేళ సభలో నువ్విచ్చిన ఉపన్యాసమేమిటి? ఇప్పుడీ తుంటరితనమేమిటి? మా అన్నకు నా మీద ద్వేషం కలిగించావు కూడాను. నీ లాంటి నీచు డుంటాడా ఎక్కడైనా?...సరే, దానికేం? చూడూ, ఈమాటు నిర్మల ఇంటి పక్కల కనపడ్డావా, నీ మెడలు విరిచేస్తాను జాగ్రత్త!"

పశుపతి కోపంతో బలంగా ఒక లెంపకాయ కొట్టి మళ్ళీ పరుగు లంకించుకున్నాడు.

నారాయణరావు, "ఆరి లుచ్ఛా!" అంటూ ఒక్క అంగలో పశుపతిని పట్టుకొని పడేసి, "ఈ అర్ధరాత్రివేళ, భీముడు కీచకుణ్ణి హతమార్చినట్లు, నిన్ను చంపేస్తాను!" అంటూ బలమైన చేతులను పశుపతి పీకచుట్టూ పోనిచ్చాడు.

# 5

"నా మూలాన ఒక హత్య జరిగిందన్న మాట!"

వణికిపోతూ నిర్మల.

"ఒక తుంటరి చస్తే బాధ ఎందుకు?

చావు మూడిందని నేనూ అనుకోలేదు. మంచిగా మాటలతో బుద్ధి చెపుదామనుకుంటే తనే చెయ్యి చేసుకొని నన్ను రెచ్చ గొట్టాడు. ఏం చెయ్యను? కోపం మహా చెడ్డది–ఉద్రేకం ఇంత పని చేయించింది," అన్నాడు నారాయణరావు బలంగా నిశ్వాస వదులుతూ.

"మనం తక్షణం ఎక్కడికైనా పారిపోవాలండీ. లేక పోతే, పోలీసులు పసి కట్టేస్తారు!"

"పారిపోతేనే అనుమానం కలుగుతుంది, నిర్మలా... ఇంతకూ పారిపోవడం దేనికి? మంచో–చెడో ఒక పని జరిగాక ఫలితానికి భయపడ కూడదు."

"మీ మాటలు వింటూంటే మీ అంతట మీరే వెళ్లి పోలీసులకు వశమయ్యేటట్లున్నారు."

"చెప్పకపోవడమేం...నిన్న రాత్రి ఆ సమయంలో అలా చెయ్యాలనే అనిపించింది. 'తిన్నగా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళు!' అని ఎవరో నా చెవిలో చెపుతోన్నట్లయింది!"

నిర్మల భయంతో "నిజంగా నేనా? అలా వెళ్ళిఉన్న ట్లయితే ఇంకేమైనా ఉందా?" అంది.

"కాని, నిన్ను వదలి వెళ్ళగలనా, నిర్మలా!"

# 6

ఆ సందర్భంలో పోలీసులు ఒక బుడబుడక్కల చేశారు.

సుపతి నాలుగు వేళ్ళకున్న పొళ్ళ ఉంగ

రాలు' వాడి వద్ద కనపడ్డాయి. వాణ్ని పోలీసులు నాలుగు తన్ని, 'ఎక్కడివిరా ఇవి?' అని అడిగితే, "మైదానంలోంచి తెల్లవారు జామునే వెడుతోంటే శవం కనబడింది. ఈ ఉంగరాలు తీసుకున్నాను," అన్నాడు.

వాణ్ని డిఫెండ్ చెయ్యడానికి ప్రభుత్వమే ఒక వకీలును ఏర్పాటుచేసింది. ఆ వకీలు ముద్దాయి తరపున వాదిస్తూ, "ముద్దాయి చెప్పినది నిజం. ఇతగాడు మైదానంలోకి రాక పూర్వమే పశుపతిని ఎవరో అక్కడ చంపేశారు. ఉంగరాలను ఆశపడి ఇతగాడు తీసుకున్నాడే కాని, దానివల్ల తనకు ప్రమాదం ఉన్నదన్న సంగతి తెలియని అమాయకుడు ముద్దాయి. పశుపతిని హత్య చేస్తోండగా చూసినట్లు సాక్ష్యం లేదు. మరొక సంగతి...డాక్టర్ గారి సాక్ష్యంలో పశుపతిని ఎవరో బలిష్ఠుడైన మనిషి పీక నులిమి చంపేసినట్టుంది. ఉఫ్ మంటే ఎగిరిపోయేటంత నీరసంగా ఉన్న ఈ ముద్దాయి, పశుపతిలాంటి బలవంతునితో తలపడి చంపడమనేది అసాధ్యం... ముద్దాయి నిర్దోషి అని ఈ దీనుని ముఖమే చెపుతోంది..." అంటూ వాదించాడు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ పురుషోత్తం, "ముద్దాయి ముఖం చూస్తే హంతకుడులాగ కనబడడం లేదు. కాబట్టి అతగాడు హత్య చేయలేదన్న వాదం సరియైనది కాదు. బోనులో, కోర్టువారి ఎదుట నిలబడ్డప్పుడు ఎట్టి ఘోరహంతకుడైనా దీనవదనంతో నిరపరాధికి మల్లేనే కనపడతాడు...చేతినిండా బంగారపు ఉంగరాలతో ఒంటరిగా అర్ధరాత్రి వేళ పశుపతి

కనిపించడమే ఈ హత్యకు కారణం. ముద్దాయి పట్టుమని పది కాన్లు చేతిలో ఎరుగని ముష్టివాడు. అందువల్ల ఆ ఉంగరాలు వాడికి పది వేలు!...ఆశ మనిషిని ఇట్టే రాక్షసుణ్ని చేస్తుంది! నమ్మ శక్యం కానంత బలాన్ని చేకూరుస్తుంది! అంతా పరిస్థితుల ప్రాబల్యప్రభావం...ఆ ఒక్క విషయమే నేరాన్ని బలంగా రూఢి చేస్తోంది. కనుక ముద్దాయి నేరస్థుడనడానికి సందేహం లేదు...శిక్షార్హులైన నేరస్థులను జాలిపడి వదిలెయ్యడం న్యాయశాస్త్రానికి విరుద్ధం. జ్యూరీలోని పెద్దలు చట్టంమీద గౌరవంతో తమ విధిని నెరవేర్చుకోవాలి..."

కొందరు ప్రాసిక్యూటర్లకు వాదనలో కన్నా వాక్కులో ఎక్కువ బలం ఉంటుంది. అందుకే పురుషోత్తం చివరికి ఈ కేసులో విజయాన్ని సాధించగలిగాడు.

## 7

"నిర్మలా!"

"ఏమండీ అలా ఉన్నారు?"

"ఆ ముష్టివాడికి ఉరిశిక్ష విధించారుట...నాకు బదులుగా ఒక నిరపరాధి తన ప్రాణాలను పోగొట్టుకుంటున్నాడు," అన్నాడు నారాయణరావు బాధగా.

"పాపం, ఎలా మరి?" అంది నిర్మల దీనంగా చూస్తూ.

"ఎలా ఏముంది, నిర్మలా? నేనొక నిశ్చయాని కొచ్చాను."

నిర్మల భయంతో వణికిపోతోంది.

"ఆ నిర్భాగ్యుని ప్రాణాలు కాపాడడానికి ఒక్కటే మార్గం. న్యాయస్థానం దగ్గరికి తిన్నగా వెళ్లి, 'హంతకుణ్ని నేనే!' అని చెప్పేసి, వాణ్ని విడిపిస్తాను."

"అయ్యోయ్, అలా చేస్తే నా గతేం కాను? మీరు లేని జీవితం నాకు దుర్భరం కదా? ఈ నరకకూపంలోంచి నన్ను పైకి లాగుతోన్న తాడు ఇలా అర్ధాంతరంగా తెగిపోయి, నేను మళ్ళీ ఈ అగాధంలో పడిపోవలసిందేనా?"

"అంతరాత్మను అణిచివేసి ఊరుకుంటే, ఆ నిరపరాధి ఉరిత్రాటినుండి వేలాడుతోన్న దృశ్యం అనుక్షణం కళ్ళకు కట్టినట్లుంటుంది. నన్ను జీవితాంతం నరకూ వేధిస్తూనే ఉంటుంది. నిర్మలా, పశుపతిని తుదముట్టించడం హత్య కాదు; ఓ నిరపరాధి ప్రాణాలు కోల్పోతూంటే ఏమీ ఎరగనట్లు ఊరుకోడమే నిజమైన హత్య...నాతో సాంగత్యం ఒక కలగా భావించి, మరచిపో! అందానికీ, సుగుణాలకూ పేరుపడ్డావు. నిన్ను భార్యగా స్వీకరించడానికి ఎందరో సిద్ధంగా ఉన్నారు. వారిలో ఒకరిని పెళ్లి చేసుకో..."

నిర్మల రోషంతో "ఏమిటి మీ మాటలు? మీ నోటమ్మట రావలసినవేనా?... నేనూ ఈ ప్రాణాన్ని వదిలేస్తాను. నన్ను మొదట చావనిచ్చి, ఆ పైన మీ అంతరాత్మ చెప్పినట్లు నడుచుకోవచ్చు."

'భ్రష్టయిపోయా'డని బంధువు లంటూంటే, ఒక్కొక్క క్షణంలో నారాయణరావుకు 'నిజమే నేమో' అనిపించేది. కాని, నిర్మల తన్నింతగా ప్రేమిస్తోందని వెల్లడియైన ఆ దివ్య

ముహూర్తం అతన్ని గర్వింపజేసింది...ఆ ప్రేమనిక్షేపాన్ని విడిచి వెళ్లిపోవడమేనా?...కాని, ఆ నిర్భాగ్యుని మాటేమిటి?

# 8

నాడు పాఠశాల వార్షికోత్సవం. పురుషోత్తంను అధ్యక్షపీఠం అలంకరించవలసిందనీ, వారి సతీమణిని బహుమతిప్రదానం జరుపవలసిందనీ ఆ పాఠశాలాధికారులు కోరారు. ఆ దంపతులు డ్రెస్సు వేసుకుని కారులో బయల్దేరేసరికి, నిర్మలతల్లి ఏడుస్తూ ఎదురుగా వచ్చి "బాబూ, నీ తమ్ముడు నా కొంప తీసేశాడు!" అంది.

"ఏం జరిగిందో త్వరగా చెప్పు. అవతల నాకు పని ఉంది...వాళ్లిద్దరూ నీతో చెప్పకుండా ఎక్కడికైనా లేచిపోయారా?" అన్నాడు పురుషోత్తం ఖంగారుగా.

"అలా చేసినా బాగుండిపోను, బాబూ. 'ఎక్కడో బతికుంది పిల్ల' అని మనస్సు కుదురు చేసుకుని ఊరుకుందును... వాళ్లిద్దరూ విషం పుచ్చుకు చచ్చిపోయారు బాబూ," అని ఆ ముసల్ది ఏడవడం మొదలెట్టింది మళ్లీ.

"విషమా? ఎందుకు తాగినట్టు?"

"ఏమో బాబూ, నాకు తెలియనిచ్చారే కాదు. నిన్ననంతా ఇద్దరూ చిలకాగోరింకల్లాగా ఎంతో సరదాగా కనబడ్డారు! వాళ్లిలా చచ్చిపోతారనుకోగలరా ఎవరైనా?... బాబూ, ఒక్క సారి మా ఇంటికి దయచెయ్యండి. ఏం చెయ్యాలో నాకు పాలుపోడం లేదు."

ఆమెను ముందు సీటులో కూర్చోమని, కారును ఆమె యింటికి పోనిచ్చాడు పురుషోత్తం, భార్యాసమేతంగా.

"బాబూ, అదుగో ఆ గదిలోనే! వెళ్ళండి... నే రాలేను! చూడలేనింక!" అందా ముసల్ది ఏడుస్తూనే.

నిర్మల మరణించినట్లు లేదు. 'ఓహో, ఎంతటి చక్కదనం!...పాపం, చూస్తే శాంతంగా నిద్రపోతున్నట్లు ఉంది!' అనుకుంది మా లక్ష్మమ్మ. 'నారాయణరావ్, ఆఖరికి నీ బ్రతుకిలా అంతమై పోయిందా, నాయనా!' అని వాపోయింది.

పురుషోత్తం ఆ గది అంతటా పరిశీలించడం ప్రారంభించాడు.

"ఏమిటండీ వెతుకుతున్నారు?" అందతని భార్య.

"ఆత్మహత్య చేసుకున్నవాళ్లు ఏదైనా ఉత్తరం రాసి పెట్టి పోతారు..." అని గొణిగాడు పురుషోత్తం.

"ఆ టేబుల్ కింద కవర్లేవో పడి ఉన్నాయండీ..."

పురుషోత్తం ఆ రెండు కవర్లనూ తీసి, "నారాయణ దస్తూరియే ఇది. జడ్జీకో ఉత్తరం, పోలీసు అధికారి కోటీ రాశాడు," అంటూ అతికించి ఉన్న ఆ కవర్లు రెండూ చించి చూశాడు.

"అలా నిర్ఘాంత పోతారేం? ఏముంది వాటిల్లో!" అందతని కళ్ళల్లోకే చూస్తూ, అతని భార్య.

"తర్వాత చెపుతాలే. ఈ ఉత్తరాల మాట పైకి పొక్కనియ్యకూడదు. ఇంటికి పోవా లిప్పుడు!...ఏదీ ఆ ముసలిది?...అమ్మీ, ధైర్యంగా ఉండు. నేను వెళ్లి పోలీసులను తీసుకొస్తాను..." అంటూ పురుషోత్తం హుటాహుటి భార్యతో కారులో బయలు దేరాడు.

ఇల్లు చేరడంతోనే పురుషోత్తం, "నయం కాదూ, ఈ ఉత్తరాలు ముందుగా నా కంటపడ్డాయ్" అన్నాడు.

"ఏముం దందులో?"

"పశుపతిని చంపుత మన నారాయణరావట..."

"ఆఁ!"

" 'ఆ ముష్టివాడు నిరపరాధి. నా నేరానికి వాణ్ని ఉరి తియ్యరాదు!' అంటూ తన రహస్యాన్ని ఈ ఉత్తరాలలో బయట పెట్టేసుకున్నాడు...ఎంత వెంగళప్పో చూడు! కేసూ, విచారణా, శిక్షా—ఈ ఆలస్యాలేమీ లేకుండా తన ప్రాణాన్ని తనే తీసుకుంటున్నానని రాశాడు-మూర్ఖుడు."

"ఇతగాడి కోసం ఆ నిర్మల కూడా విషం పుచ్చుకున్న దన్న మాట!"

"ఔను; వీడు లేకపోతే ఆవి డింక బతకలేదుట! ఒకరి కొకరు కూడబలుక్కుని చేసిన పనేట ఇది!...తెలివి తక్కువ

వాజమ్మలు!" అంటూ పురుషోత్తం అగ్గిపుల్ల వెలిగించి ఆ ఉత్తరాలను తగలబెట్టేశాడు.

మహాలక్ష్మమ్మ నిర్ఘాంతపోయి, "అరే! పోలీసుల కివ్వరూ?" అంది.

"పోలీసులకా? ఐతే, ఇంక మనకు 'పరువు' అనేది అక్కర్లేదా? 'హంతకుడు నారాయణ అన్నగారు రమణో!' అని ప్రతీవాడిచేతా వేలెట్టి చూపించుకోమన్నావా నన్ను!"

"అయ్యో, ఎంత పని చేశారు! ఆ ముష్టివాణ్ని రక్షించడం కోసమే కదండీ వాళ్ళిద్దరూ నిండు ప్రాణాలు తీసేసుకున్నారు!"

"కావచ్చు. కాని ఓ ముష్టివాని ప్రాణం కోసం నా పరువుప్రతిష్ఠలకు భంగం రాకూడదు. ఈ రహస్యం అగ్నిహోత్రుని గర్భంలో ఇలా ఇమిడి పోవలసిందే!"